# బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు






పెద్దపల్లి : నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు

- **పెద్దపల్లి గడ్డపై ఎగిరేది గులాబీ జెండాయే**
- **పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి**
- **రైల్వేస్టేషన్ రోడ్డులోని అభయాంజనేయ ఆలయంలో పూజలు**
- **పెద్దపల్లి ఆర్వో ఆఫీసులో నామినేషన్ దాఖలు**

పెద్దపల్లి టౌన్ నవంబర్ 9: పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమాల పురిటిగడ్డ పెద్దపల్లిపై ఎగిరిది గులాబీ జెండానేని చెప్పారు. గురువారం మనోహర్‌రెడ్డి ఇంటివద్ద అర్చకులు పూజలు చేయించి ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి రైల్వేస్టేషన్ రోడ్‌లోని అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటి నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులతో కలిసి బయల్దేరి రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ మధుమోహన్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. తర్వాత పెద్దమసీదు నుంచి రాల్యీగా అమర్‌నగర్, ప్రగతినగర్, అయ్యప్ప దేవాలయం మీదుగా బస్‌స్టాండ్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా పెద్దపల్లిలో గులాబీ పార్టీ గెలవడం ఖాయమని విశ్వాసం వ్యక్తంచేశారు. తాను సీఎం కేసీఆర్ సహకారం, ఇక్కడి ప్రజల దీవెనలతో తొమ్మిదిన్నరేండ్లు రూ. 10 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించానన్నారు. తెలంగాణ ప్రభుత్వ రైతుల కోసం రైతుబంధు, నిరుపేద ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. దళితబంధు కింద నిరుపేద దళితకుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. బీసీబంధు, మైనార్టీ బంధు ద్వారా రూ. లక్ష చొప్పున అందిస్తున్నామని పేర్కొన్నారు. మళ్లీ గెలిపిస్తే నిరుపేద మహిళలకు ప్రతి నెల రూ.3వేలు అందిస్తామని, రూ400కే గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్ రూ. 5వేలు, వికలాంగుల పెన్షన్ రూ.6వేలు, రైతు బంధును రూ.16వేలకు పెంచడం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15 లక్షలుగా పెంచుతామని ప్రకటించారు. తెల్ల రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికి సన్నా బియ్యం, రూ. 5లక్షల ప్రమాదబీమా లాంటి ఏన్నో ప్రయోజనాలు ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని దండంపెట్టి వేడుకుంటున్నానని చెప్పారు. ఇక్కడ మండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సీ. సత్యనారాయణరెడ్డి, మేకల మల్లేశం, వేముల రాంమూర్తి, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఓదెల: మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న రవీందర్‌సింగ్

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించాలని..

- **ఓదెల మల్లన్న సన్నిధిలో సర్ధార్ రవీందర్‌సింగ్ పూజలు**

ఓదెల, నవంబర్ 9: బీఆర్ఎస్ హ్యాట్రిక్ గెలుపు సాధించాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి సర్ధార్ రవీందర్‌సింగ్ ఓదెల మల్లన్నను వేడుకున్నారు. గురువారం మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, దాసరి మనోహర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచేలా అనుగ్రహించాలని వేడుకున్నట్లు చెప్పారు. స్వరాష్ట్రంలోనే పెద్దపల్లి నియోజకవర్గ రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

# ప్రజాసేవకే నా జీవితం అంకితం






గోదావరిఖని : నామినేషన్ ర్యాలీలో రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

- **రామగుండం ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే**
- **మరోసారి ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా**
- **నామినేషన్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్**

గోదావరిఖని, నవంబర్ 9: 'నా సర్వస్వం ప్రజాసేవకే అంకితం..రామగుండం నియోజకవర్గంలోని ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే..' అని రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. గురువారం గోదావరిఖని సింగరేణి స్టేడియంలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రజా ఆశీర్వాద సభకు ఆయన హాజరై వేలాదిగా తరలివచ్చి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. '2018లో రామగుండం ఎమ్మెల్యేగా గెలిపించిన మీ రుణం తీర్చుకోలేనిది..మీ అందరి సహకారంతోనే అభివృద్ధి చేసిన' అంటూ ప్రకటించారు. భవిష్యత్ రామగుండం అభివృద్ధి వేగంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తానని చెప్పారు. మళ్లీ గెలిపిస్తే గోదావరి నది తీరాన కరకట్ట నిర్మించి ముంపు ప్రభావం లేకుండా రామగుండం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. మహిళలను వారి కాళ్లపై నిలబడే విధంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రధానమైన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నింటినీ నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకు లు, కార్యకర్తలు తరలిరావడంతో స్టేడియం కిక్కిరిసి పోయింది. హిందూ పూజారులు, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు చందర్‌ను దీవిస్తూ ఆయన మరోసారి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అలాగే దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు ఖడ్గాన్ని బహూకరించారు.

**అశేషంగా తరలివచ్చిన జనం..**

రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ గురువారం నాడు నామినేషన్ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు అశేషంగా తరలివచ్చారు. రామగుండంలోని 50 డివిజన్లతోపాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రజలు గోదావరిఖనికి పోటెత్తారు. నామినేషన్‌కు ముందుగా గోదావరిఖని స్టేడియంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఉదయం 9 గంటలకే ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కోరుకంటి చందర్ నామినేషన్ సందర్భంగా వివిధ ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం తన ఇంటి వద్ద నుంచి పాదయాత్రగా మధ్యాహ్నం 12 గంటలకు స్టేడియానికి చేరుకున్నారు. తమ నాయకుడు రాగానే బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఆయన ప్రసంగాన్ని విన్న ప్రజలు అక్క డ నుంచి ఆయన వెంట గోదావరిఖని చౌరస్తాకు చేరుకున్నారు. చౌరస్తాలో కోరుకంటి చందర్‌కు ఘన స్వాగతం లభించింది. అప్పటికే వేలాది మంది గోదావరిఖని చౌరస్తాలో ఆయన కోసం వేచి ఉన్నారు. తనను ఆశీర్వదించడానికి వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మ ణ్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా శ్రమించాలి



మంథనిలో మాట్లాడుతున్న అక్కెపల్లి మాజీ ఉప సర్పచ్ పెయ్యల సంధ్య-కుమార్

- **కార్యకర్తలు గడపగడపకూ వెళ్లండి**
- **అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించండి**
- **మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని, నవంబర్ 9: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా శ్రమించాలని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గడపగడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసేలా చూడాలని కోరారు. మంథని మండలం అక్కెపల్లి మాజీ ఉప సర్పంచ్ పెయ్యల సంధ్యాకుమార్‌తో పాటు సీనియర్ నాయకులు సిద్ద సదయ్య, సిద్ద కోటేశ్, పెయ్యల శ్రీకాంత్, పెయ్యల సాయి, నారాయణ, వెంకటి, ఓదెలు, మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ నేతలు తొంబరపు రవి, దేవరాజ్ మంథనిలో రాజగృహలో పుట్ట మధూకర్, మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మధూకర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పథకాలు రూపొందించారని కొనియాడారు. అందుకే బీఆర్ఎస్‌లో చేరేందుకు అన్ని పార్టీల నాయకులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

**మంథనిలో టీడీపీ ఖాళీ..**

మంథని నియోజకవర్గంలో టీడీపీ పార్టీ పూర్తిగా ఖాళీ అవుతున్నది. ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడీ శ్రీనివాస్‌రెడ్డి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన విషయం విదితమే. ఆయనతో కలిసి పని చేసిన టీడీపీ నాయకులు మెండే రాజయ్య, మెండే లక్ష్మి, బడుగు మహేశ్, మట్ట శంకర్, మంథని సమ్మయ్య బీఆర్ఎస్‌లో చేరారు.

**సమస్యలు పరిష్కరించింది మధూకరే..**

కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ మా గ్రామంలోని సింగరేణి, జేసీబీ ఆఆంటి సమస్యలను తాము పుట్ట మధూకర్ దృష్టికి తీసుకెళ్తే వాటిని పరిష్కరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అందుబాటులో ఉండరు.. ప్రజలకు ఏ పని చేయరు.. కాంగ్రెస్‌కు చెందిన మేం మా సర్పంచ్‌తో వచ్చి సమస్యలను చెప్పుకుంటే వెంటనే పరిష్కరించారు. కానీ ప్రజల ఓట్లతో గెలిచిన శ్రీధర్‌బాబు మమ్మల్ని పట్టించుకోవడంలేదు. అందుకే ఆ పార్టీలో ఉండడం ఇష్టం లేకనే వీడుతున్నాం. పుట్ట మధూకర్ గెలుపుకోసం పనిచేస్తాం.

**-పెయ్యల సంధ్య-కుమార్ , అక్కెపల్లి మాజీ ఉపసర్పంచ్**